క్లుప్తంగా

బతుకమ్మ సంబురాలు



బతుకమ్మలతో మహిళలు

తాంసి: మండలంలోని కప్పర్ల గ్రామంలో సోమవారం బతుకమ్మ సంబురాలను ఘనంగా నిర్వహించారు. రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి ఆడిపాడారు. బతుకమ్మ పాటలు ఆలపిస్తూ.. యువతులు చేసిన నృత్యం ఆకట్టుకుంది. అనంతరం స్థానిక చెరువులో బతుకమ్మలను నిమజ్జనం చేసి వెళ్లిరా బతుకమ్మ అంటూ గౌరమ్మకు వీడ్కోలు పలికారు. గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో బతుకమ్మ నిమజ్జన ఏర్పాట్లు చేశారు.

నేరడిగొండ: బతుకమ్మ సంబరాలను మండల వ్యాప్తంగా ఘనంగా నిర్వహిస్తున్నారు. సోమవారం నేరడిగొండ మండల కేంద్రంలో నిర్వహించిన బతుకమ్మ నిమజ్జన కార్యక్రమానికి బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఆయన సతీమణి హరిప్రియతో కలిసి హాజరయ్యారు.

నారాయణ బాబా పుణ్యతిథి విజయవంతం చేయాలి

ఆదిలాబాద్: శ్రీసంత్ సద్గురు నారాయణ బాబా 18వ పుణ్య తిథి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పాయల్ ట్రస్ట్ చైర్మన్ పాయల్ శరత్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈనెల 19న తలమడుగు మండలంలోని పల్సి(బి)తండా గ్రామంలో సంత్ నారాయణ బాబా ఆశ్రమంలో ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సురేశ్, సంతోష్, ప్రకాష్, చింటూ పాల్గొన్నారు.

దుర్గాదేవిని దర్శించుకున్న ఎమ్మెల్యే

ఇంద్రవెల్లి: మండలంలోని దస్నాపూర్ గ్రామంలో దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన దుర్గాదేవి మండపం వద్ద ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా గ్రామస్తుల ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు. ప్రతిఒక్కరూ చెడుమార్గాలకు దూరంగా ఉండి ఆధ్యాత్మిక మార్గంలో ప్రయాణించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

'ఇందిరమ్మ కమిటీల ఏర్పాటు చట్ట విరుద్ధం'



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఇంద్రవెల్లి: ఇందిరమ్మ కమిటీల ఎంపిక ప్రక్రియ సరైన పద్ధతి కాదని, ఏజెన్సీ ప్రాంతంలో పూర్తి హక్కులు పెసా గ్రామసభలకే ఉంటుందని ఆదివాసీ సేన మండల కన్వీనర్ మెస్రం సుదర్శన్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఇందిరమ్మ కమిటీలను రద్దు చేయాలని అధికారులకు వినతిపత్రం అందజేశారు. గత ప్రభుత్వం చేసిన తప్పిదాలను కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తుందని మండిపడ్డారు. జిల్లా కలెక్టర్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఇందిరమ్మ కమిటీల ఏర్పాటు జీవోలో మార్పులు చేయాలన్నారు. కార్యక్రమంలో ఆదివాసీ సేన నాయకులు సేడ్మకి కాశీరాం, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు.. భవిష్యత్ మార్గ నిర్దేశకులు

బోథ్: ఉపాధ్యాయులు విద్యార్థుల భవిష్యత్‌కు మార్గ నిర్దేశకులని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. సోమవారం మండలంలోని కౌఠ(బి) గ్రామంలో ఇటీవల ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించిన పలువురిని సత్కరించారు. ఉద్యోగాలు సాధించిన వారిని యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సంధ్యారాణి, మల్లెపూల గంగన్న, బద్దం శ్రీకాంత్ రెడ్డి, స్వామి, రమణరెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేటి నుంచి పాదయాత్ర

ఎదులాపురం: తెలంగాణ ఉద్యమకారుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం నుంచి ఈనెల 29వ వరకు తెలంగాణ ఉద్యమకారుల సంఘం ఆధ్వర్యంలో పాదయాత్ర నిర్వహించడం జరుగుతుందని సంఘం జిల్లా అధ్యక్షుడు సామల ప్రశాంత్ తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారుల సమస్యలను పట్టించుకోలేదని విమర్శించారు. 250 చదరపు గజాల ఇంటి స్థలం ఇవ్వాలని కోరారు. పింఛన్ సౌకర్యం కల్పించడంతోపాటు బస్సు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం ప్రధాన కార్యదర్శి నిమ్మల నరేందర్, శ్రీ రామాంజనేయులు, ఎండి రఫీక్, సుజాత, కిరణ్, ప్రభాకర్ పాల్గొన్నారు.

కూరగాయల సాగు.. లాభాలు బాగు

- సాంకేతిక పద్ధతులతో సాగు చేస్తున్న రైతు
- రెండేకరాల్లో వివిధ రకాల కూరగాయల సాగు



కూరగాయలు సాగు చేస్తున్న రైతు

తాంసి: కొంతమంది రైతులు నేటికి పాత పద్ధతిలోనే సంప్రదాయ పంటలు పండిస్తూ అంతంత మాత్రంగా దిగుబడి సాధిస్తున్నారు. మరికొంత మంది రైతులు పత్తి, సోయా, కంది పంటలు కాకుండా కూరగాయలు సాగు చేస్తూ.. తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు పొందుతున్నారు. ఆధునిక పద్ధతులు పాటిస్తూ.. కొంత మంది రైతులు కూరగాయాల సాగు చేపడుతున్నారు. ఒకే చేనులో విడతాల వారీగా దిగుబడి వచ్చే విధంగా సాగుచేస్తూ ఉపాధి పొందుతున్నారు. తాంసి మండలంలోని వడ్డాడి గ్రామానికి చెందిన కేమ పోచ్చన్న అనే రైతు గత ఏడాది వరకు పత్తి, కంది సాగు చేసేవాడు. అధిక వర్షాలు, పురుగు ఉధృతి కారణంగా సరైన దిగుబడి రాక నష్టపోయేవాడు. దీంతో సంప్రదాయ పంటలైన పత్తి, కంది కాకుండా గతేడాది నుంచి వరుసగా వివిధ రకాల కూరగాయలు సాగు చేస్తున్నాడు. పండిన కూరగాయలను మార్కెట్‌కు తీసుకెళ్లకుండా చేను వద్ద ఉన్న అంతరాష్ట్ర రోడ్డు పక్కన విక్రయిస్తున్నాడు. వినియోగదారులు సైతం తాజా కూరగాయలు పంటచేను వద్దనే లభించడంతో నిత్యం పెద్ద ఎత్తున కొనుగోలు చేస్తున్నారు.

రెండేకరాల్లో 10 రకాల కూరగాయల సాగు..

వడ్డాడి శివారులో వడ్డాడి గ్రామానికి చెందిన రైతు కేమ పొచ్చన్న రెండేకరాలు కౌలుకు తీసుకొని దాదాపుగా 10 రకాలకు పైగా కూరగాయలు సాగు చేస్తున్నాడు. మొదట మిర్చి, టమాట, వంకాయ, అలిసెంత, బబ్బెర, బెండ, బీరకాయ, కాకరతో పాటు గోబి, పాలకూర, మెంతి, కొత్తిమీర సాగు చేస్తున్నాడు. పంటలు మంచి దిగుబడి వచ్చే విధంగా సంరక్షణ చర్యలు చేపడుతున్నాడు. ప్రస్తుతం టమాట, వంకాయ, బీర పంటలు దిగుబడి వస్తున్నాయి. వీటితో పాటు అర ఎకరంలో బంతి పూలు సాగు చేశాడు. బంతిపూలకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉండటంతో కిలోకి రూ.80 నుంచి రూ.100 వరకు డిమాండ్ ఉంది. టమాట, బీర పంటలు దెబ్బతినకుండా పందిరి పద్ధతిలో కర్రలను ఏర్పాటు చేసి సాగు చేస్తున్నాడు. రెండు ఎకరాల్లో కూరగాయల సాగు కోసం రూ.1.50 లక్షల వరకు పెట్టుబడి పెట్టాడు. మార్కెట్‌కు తరలించే అవసరం లేకుండా చేను వద్దనే విక్రయిస్తున్నాడు. ప్రస్తుతం ప్రతీ రోజు పంటచేల్లో పండించి విక్రయిస్తున్న కూరగాయాలు, పూల ద్వారా రోజుకు రూ.5వేల వరకు ఆదాయం పొందుతున్నాడు.

ప్రతీరోజు ఆదాయమే..



కూరగాయల సాగు చేయడం ద్వారా రోజు ఆదాయం వచ్చే అవకాశం ఉంటుంది. ఆకుకూరలతో పాటు అన్ని రకాలకు చెందిన కూరగాయలు ప్రస్తుతం సాగు చేస్తున్నాను. దిగుబడి వస్తున్న కూరగాయలు కూలీల ద్వారా తీయించి ఇక్కడే విక్రయిస్తున్నాను. నిత్యం ఆదాయం రావడంతో పాటు కూరగాయలు తీయడానికి కూలీలకు సైతం ఉపాధి దొరుకుతుంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు అక్కడే ఉంటూ కూరగాయలను కోస్తూ అవసరమైన వారికి తాజా కూరగాయలు అమ్ముతున్నాం.

– కేమ పోచ్చన్న, రైతు వడ్డాడి

'బురద జల్లే ప్రయత్నం మానుకోవాలి'



సమావేశంలో మాట్లాడుతున్న సంతోష్

ఎదులాపురం: ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్‌పై కాంగ్రెస్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్ రెడ్డి బురద జల్లే ప్రయన్నం మానుకోవాలని మున్నూరు కాపు సంఘం నాయకుడు సంతోష్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో సోమవారం మాట్లాడారు. హిందూ సమాజ ఉత్సవ సమితికి ఎమ్మెల్యేకు ఎటువంటి సంబంధం లేదన్నారు. అయినప్పటికీ మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ పేరు ఆహ్వాన పత్రికలో ముద్రించలేదని విమర్శలు చేయడం సరికాదన్నారు. గతంలో మున్నూరు కాపులపై చేసిన వ్యాఖ్యలను తాము మర్చిపోలేదని, ప్రస్తుతం అకస్మాత్తుగా ప్రేమ ఎలా పుట్టుకొచ్చిందని ప్రశ్నించారు. సమావేశంలో కౌన్సిలర్లు రఘుపతి, ఆకుల ప్రవీణ్, నాయకులు జోగు రవి, దయాకర్ కేశవ్, శివ, సాయి, మహేందర్ తదితరులు ఉన్నారు.

కంది శ్రీనివాస్ రెడ్డి వ్యాఖ్యలు సరికాదు

ఎమ్మెల్యే పాయల్ శంకర్‌పై కాంగ్రెస్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు సరికాదని బీజేపీ దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు అస్తక్ సుభాష్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. దసరా మైదానంలో జరిగినటువంటి దసరా ఉత్సవ వేడుకల్లో మున్సిపల్ చైర్మన్, కంది శ్రీనివాస్ రెడ్డిని పిలవలేదని అనవసరంగా ఎమ్మెల్యేపై ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి, కంది శ్రీనివాస్ రెడ్డికి ఓటమి తప్పదన్నారు. సమావేశంలో దమ్మపాల్, గోవర్ధన్, నాందేవ్, మహేందర్, అశోక్, సునీల్, పోచన్న, అడేల్లు విజయ్, కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

'ఎమ్మెల్యే వివేక్ వ్యాఖ్యలు ఖండిస్తున్నాం'



మాట్లాడుతున్న మల్లేష్, నాయకులు

ఆదిలాబాద్‌రూరల్: ఆదిలాబాద్‌లో జరిగిన మాలల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ ఎస్సీల వర్గీకరణను తప్పు పట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని మాదిగ జేఏసీ జిల్లా అధ్యక్షుడు మల్యాల మనోజ్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ భవనంలో మాట్లాడారు. సుప్రీంకోర్టు వెనుకబడి ఉన్న మాదిగ ఉపకులాలు ఆర్థికంగా, సామాజికంగా, విద్యా, ఉద్యోగపరంగా రాజకీయపరంగా అభివృద్ధి చెందాలంటే ఎస్సీలలో ఏబీసీడీ వర్గీకరణ తప్పనిసరిగా చేయాల్సిందేనని పేర్కొందన్నారు. అన్ని రాష్ట్రాలకు ఉత్తర్వులు జారీ చేస్తే ఎస్సీ వర్గీకరణను తప్పుగా చిత్రీకరించడాన్ని సుప్రీంకోర్టు ధిక్కరణ అవుతుందన్నారు. ఈ విషయమై ఎమ్మెల్యేపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాల్సి వస్తుందన్నారు. సమావేశంలో సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఎదులాపురం: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చినటువంటి తీర్పునకు వ్యతిరేకంగా ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి చేసిన వ్యాఖ్యలు సరికాదని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఆరెల్లి మల్లేష్ మాదిగ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. గత 70 సంవత్సరాల నుంచి మాదిగ ఉపకులాలు విద్య, ఉద్యోగ, రాజకీయ, సంక్షేమ రంగాల్లో రావాల్సిన హక్కుల కోసం పోరాడారని పేర్కొన్నారు. అయితే తన రాజకీయ అస్తిత్వాన్ని కాపాడుకోవాలనే ఉద్దేశంతో వివేక అర్థరహిత వ్యాఖ్యలు చేశారని మండిపడ్డారు. వివేక్ వెంకటస్వామి వ్యాఖ్యల వెనుక సీఎం రేవంత్ రెడ్డి హస్తం ఉన్నట్టు కనిపిస్తుందని ఆరోపించారు. సమావేశంలో నాయకులు గంగన్న,, నవీన్, సూర్యకాంత్, ఎల్లన్న, గంగన్న, రాజు, శంకర్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ముఖరా(కె)లో పోస్టుకార్డు ఉద్యమం



పోస్టుకార్డులతో నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

ఇచ్చోడ: కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆరు గ్యారంటీలను అమలు చేయాలని డిమాండ్ సోమవారం ముఖరా(కె) గ్రామంలో పోస్టుకార్డు ఉద్యమం ప్రారంభించారు. ఈమేరకు పోస్టుకార్డులతో నిరసన తెలిపారు. ఈసందర్భంగా మాజీ సర్పంచ్ గాడ్గే మీనాక్షి, ఎంపీటీసీ గాడ్గే సూభాష్‌లు మాట్లాడారు. మహాలక్ష్మి పథకం కింద ప్రతీ మహిళకు రూ. 2500 ఇవ్వాలని డిమాండ్ చేశారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు తులం బంగారం ఇవ్వాలని, డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థినులకు స్కూటీలు ఇవ్వాలని, రైతు బరోసా, రూ. రెండు లక్షల రుణమాఫీ, 4 వేల పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. వంద రోజుల్లో హామీలు అమలు చేస్తామన్న కాంగ్రెస్ ఆరు నెలల దాటిన అమలు చేయకుండా జాప్యం చేస్తుందని ఆరోపించారు. పోస్టుకార్డుల ద్వారా నిరసన తెలిపి సీఎం రేవంత్‌రెడ్డి, సోనియాగాంధీ, రాహుల్‌గాంధీలకు పంపించారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

పది వేల సభ్యత్వం పూర్తి చేయాలి



మాట్లాడుతున్న చంద్రశేఖర్

ఇచ్చోడ: ప్రతీ మండలంలో పదివేల సభ్యత్వ నమోదును పూర్తి చేయాలని బీజేపీ రాష్ట్ర సంఘటన మంత్రి చంద్రశేఖర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో కార్యకర్తలు, నాయకులతో మాట్లాడారు. ప్రతీ బూత్‌లో రెండు వందల మంది సభ్యత్వం నమోదు చేయాలన్నారు. సభ్యత్వ నమోదు పూర్తి చేయడానికి కార్యకర్తలు, నాయకులు కలిసికట్టుగా సమన్వయంతో ముందుకు వెళ్లాలని సూచించారు. కష్టపడే నాయకులు, కార్యకర్తలకు పార్టీ గుర్తిస్తుందన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షులు పతాంగే బ్రహ్మనందం, జిల్లా ఉపాధ్యక్షుడు గుమ్మడి భీంరెడ్డి, కొల్లూరి చంద్రశేఖర్, కేంద్రే నారాయణ, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దమ్మచక్ర పరివర్తన్ దివస్



పంచశీల జెండా ఆవిష్కరిస్తున్న గ్రామ పెద్దలు

నార్నూర్: మండల కేంద్రంలోని బుద్ధ విహార వద్ద సోమవారం అంబేద్కర్ అసోసియేషన్, విశాఖ మహిళా మండలి ఆధ్వర్యంలో దమ్మచక్ర పరివర్తన్ దివస్‌ను ఘనంగా నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడు లోఖండే కేశవరావు, మాజీ సర్పంచ్ బానోత్ గజానంద్ నాయక్ పాల్గొని బుద్ధ విహార వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. శాంతి మార్గాన్ని ఎంచుకొని దసరా రోజున అంబేద్కర్ బుద్ధ ధర్మాన్ని స్వీకరించిన రోజన్నారు. యువత బుద్ధుడి సిద్ధాంతాల అములుకు, అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ వర్క్స్ బోర్డ్ చైర్మన్ యునస్ అక్బని, పీఏసీఎస్ ఇన్‌చార్జి చైర్మన్ ఆడే సురేష్, డైరెక్టర్ దుర్గే కాంతారావు, ఐటీడీఏ డైరెక్టర్ మాడవి మాన్కు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు లోఖండే దేవురావు, మెస్రం హనుమంతరావు, కాంబ్లే బాలాజీ, లోఖండే చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

'ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు'



మాట్లాడుతున్న రమేశ్

ఆదిలాబాద్‌రూరల్: చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామిపై ఎమ్మార్పీఎస్ నాయకులు చేసిన వ్యాఖ్యలు సరికాదని మాల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కొప్పుల రమేశ్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సంఘ భవనంలో ఏర్పాటు చేసిన మాట్లాడారు. మాల ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న వివేక్ వెంకటస్వామి మాలల ఐక్యతకు మాత్రమే పిలుపునిచ్చారన్నారు. వర్గీకరణ చేసే విషయంలో మాలల జనాభాను తక్కువ చేసి చూపకుండా ఖచ్చితమైన లెక్కలు తేల్చినంతరమే ముందుకు వెళ్లాలని డిమాండ్ చేయడం జరిగిందన్నారు. వివేక్ వెంకట స్వామిని ఎమ్మెల్యే పదవీకి రాజీనామా చేయమనడానికి ఎమ్మార్పీఎస్ నాయకులకు ఎలాంటి హక్కులేదన్నారు. సమావేశంలో నాయకులు రాఘవేంద్ర, రాజు, రఘు, సురేందర్ పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలల నిరవధిక బంద్

బోథ్: మూడేళ్లుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ ప్రభుత్వం ఇవ్వకపోవడంతో డిగ్రీ కళాశాలను యాజమాన్యాలు నిరవధికంగా బంద్ నిర్వహించారు. మండల కేంద్రంలోని వాగ్దేవి డిగ్రీ కళాశాల గేట్‌ను మూసి ఉంచారు. గేట్‌కు బంద్‌కు సంబంధించిన ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. కళాశాల బంద్ ఉండడంతో విద్యార్థులు వెనుదిరిగారు. తమ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని యాజమాన్యాలు ప్రభుత్వాన్ని కోరుతున్నాయి. ఫీజులు విడుదల చేయకపోవడంతో సిబ్బందికి జీతాలు కూడా ఇవ్వలేని పరిస్థితి నెలకొందని వాపోయారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

బేల: గత మూడేళ్లుగా ఫీజు రీయింబర్స్‌మెంట్స్ రాకపోవడంతో డిగ్రీ కళాశాలల నిర్వహణ భారంగా మారిందని బేలలోని కీర్తన డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వరప్రసాద్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. డిగ్రీ కళాశాల నిరవధిక బంద్ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి వెంటనే పెండింగ్‌లో ఉన్న బిల్లులు చెల్లించి ఆదుకోవాలని కోరారు. వైస్ ప్రిన్సిపాల్ గెడం ప్రవీణ్, సీనియర్ అధ్యాపకులు పుష్ప పాల్గొన్నారు.

ఓటర్లుగా నమోదు చేసుకోవాలి

ఆదిలాబాద్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఓటర్లుగా నమోదు చేసుకోవాలని బీజేపీ ఎమ్మెల్సీ ఓటర్ ఎన్‌రోల్‌మెంట్ ఇన్‌చార్జి గటిక క్రాంతి కుమార్ ఒక ప్రకటనలో అన్నారు. 2022 సంవత్సరం కన్నా ముందు డిగ్రీ పట్టా పొందిన గ్రాడ్యుయేట్స్‌కు ఎన్నికల్లో ఓటర్లుగా అవకాశం కల్పించడం జరిగిందన్నారు. అవగాహన లేని కారణంగా ఎంతో మంది అర్హులైన ఓటర్లు నమోదు చేసుకోవడం లేదని పేర్కొన్నారు.

రక్తదానం చేయాలి

బోథ్: ప్రతిఒక్కరూ రక్తదానం చేసి, అపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడాలని బోథ్ ఎమెల్యే అనిల్ జాదవ్ అన్నారు. సోమవారం మండలంలోని కౌఠ(బి) గ్రామంలో స్వామి వివేకానంద యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. యువకులు పెద్ద ఎత్తున పాల్గొని, రక్తదానం చేశారు. 50 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. కార్యక్రమంలో ఎస్సై ఎల్. ప్రవీణ్ కుమార్, మాజీ జెడ్పీటీసీ సంధ్యారాణి, యూత్ సభ్యులు వెండి సోమేశ్వర్, అరవింద్, పృథ్వీ, అబ్దుల్, గ్రామస్తులు పాల్గొన్నారు.

సన్మానం

ఇంద్రవెల్లి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో 2004–05 బ్యాచ్‌లో పదో తరగతి పూర్వ విద్యార్థులు కాంబ్లే రాహుల్, గణేష్‌లు ఉపాధ్యాయ ఉద్యోగం సాధించడంతో ఆ బ్యాచ్ తోటి విద్యార్థులు సోమవారం వారిని ఘనంగా సత్కరించారు. తమ తోటి విద్యార్థులు ఉపాధ్యాయ ఉద్యోగం సాధించడం అభినందనీయమన్నారు. పూర్వ విద్యార్థులు మహేశ్ కదాం, హనుమాన్, సలీమ్, సోహెల్, రాజువర్ధాన్, సాయి, వినోద్ పాల్గొన్నారు.

భీం వర్ధంతి విజయవంతం చేయండి

నార్నూర్: కుమురం భీం జిల్లా జోడేఘాట్‌లో ఈనెల 17న నిర్వహించే కుమురం భీం వర్ధంతి విజయవంతం చేయాలని ఆదివాసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు పెందూర్ దాదిరావు కోరారు. సోమవారం గాదిగూడ మండలంలోని లోకారి(కె)లో కుమురం భీం చౌక్ వద్ద కరపత్రాలు ఆవిష్కరించారు. నేడు ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసీ గిరిజనుల హక్కుల పరిరక్షణ కోసం భీం స్ఫూర్తితో పోరాటం చేయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. కార్యక్రమంలో నాయకులు పెందుర్ సంతోష్, నటరాజ్, పెందూర్ మధు, వెడ్మా జ్యోతిరామ్, జుగ్నాక మోతీరాం, మెస్రం సంతోష్, ఆత్రం విజయ్, మాణిక్ రావు, మెస్రం లచ్చు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ఇంద్రవెల్లి: రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో మార్క్‌ఫెడ్ సహకారం, పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సోయా కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ప్రతీ గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందన్నారు. రైతుల గురించి ఆలోచించే ఏకైక ప్రభుత్వం తమదన్నారు. రైతులు ప్రైవేటు దళారులకు పంటలను అమ్మి మోసపోవద్దన్నారు. సోయాబీన్ కనీస మద్దతు ధర రూ. 4892 రూపాయలు ఉందని, రైతులు తమ పంటలను ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలోనే అమ్మి మద్దతు ధర పొందాలన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ మారుతి డొంగ్రె, సహకార శాఖ సీనియర్ ఇన్‌స్పెక్టర్ ఆడిటర్ సుజాత, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముఖడే ఉత్తం, ఎండీ మసుద్, మెస్రం నాగ్‌నాథ్, జహీర్, సోమోరే నాగోరావ్, పవార్ దుదిరామ్, సూర కొమరయ్య పాల్గొన్నారు.

15 నుంచి పశువులకు గాలికుంటు నివారణ టీకాలు

ఇచ్చోడ: ఈనెల 15 నుంచి మండల వ్యాప్తంగా పశువులకు ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయనున్నట్లు పశువైద్యాధికారి గోవింద్‌నాయక్ తెలిపారు. ఈనెల 15 ఇచ్చోడ, 16 న ముఖరా(కె), 17న ముఖరా(బి), 18న దేవుల్‌నాయక్‌తండా, 19న సాథ్‌నంబర్, ఇస్లాంనగర్, 20న కోకస్‌మన్నూర్, 21న అడేగామ(బి), 22న అడేగామ(కె), 23న గుబ్బ, తండా, 24న గాంధీనగర్, 25న బోరిగామ, 26న కామాగిరి, 27న జున్ని, 28న జామిడి, 29న గేర్జం, 30న జల్దా, నవంబర్ 1న దర్మంపూరి, 2న నవేగావ్, 3న దుబార్‌పేట్, 4న మాదపూర్, పట్వారిగూడ, 5న మేడిగూడ, మాన్కపూర్, 6న సల్యాద, 7న మల్యాల్, యాపల్‌గూడ, 8న గుండి, గుండివాగు, 9న నర్సాపూర్, 10న కేశవపట్నం, 11న గుండాల, 12న బావోజీపేట్, 13న సిరిచెల్మ, 14న తలమద్రి, 15న దాబా(బి), 16న దాబా(కె), 17న హిరపూర్‌లో పశువులకు ఉచిత గాలికుంటు నివారణ టీకాలు వేయనున్నట్లు పేర్కొన్నారు. రైతులు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

దసరా వేడుకలు విజయవంతం



మాట్లాడుతున్న ప్రమోద్ కుమార్ ఖత్రి

ఎదులాపురం: సనాతన హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని డైట్ కళాశాల మైదానంలో నిర్వహించిన వేడుకలు విజయవంతమైనట్లు ఆ సమితి జిల్లా అధ్యక్షుడు ప్రమోద్ కుమార్‌ఖత్రి తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో సోమవారం మాట్లాడారు. వేడుకలకు ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారని పేర్కొన్నారు. తాము ఊహించిన దానికంటే అత్యధికంగా ప్రజలు తరలిరావడంపై హర్షం వ్యక్తం చేశారు. అలాగే తమకు ఎలాంటి రాజకీయ నాయకులతో సంబంధాలు లేదన్నారు. సమితి ఆధ్వర్యంలో రామ్ లీలా మైదానంలో నిర్వహించిన వేడుకలకు పలువురు ఆటంకం కలిగించారని పేర్కొన్నారు. వేడుకల విజయవంతానికి కృషి చేసిన అధికారులకు, పోలీస్ శాఖకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఇందులో సమితి ప్రధాన కార్యదర్శి గెడమ్ మాధవ్, గౌరవ అధ్యక్షుడు వామన్ పాల్గొన్నారు.

సీపీఎం పట్టణ కార్యదర్శిగా బండి దత్తాత్రి

ఎదులాపురం: సీపీఎం పట్టణ కార్యదర్శిగా బండి దత్తాత్రిని ఏకగ్రీవంగా ఎన్నియ్యారు. జిల్లా కేంద్రంలోని సుందరయ్య భవనంలో సోమవారం నిర్వహించిన పట్టణ మహాసభల్లో ఎన్నుకున్నట్లు దత్తాత్రి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సీసీఐ సిమెంట్ ఫ్యాక్టరీ పునః ప్రారంభం, ఆదిలాబాద్–ఆర్మూర్ రైల్వేలైన్, విమానాశ్రయం, టెక్స్‌టైల్స్ పరిశ్రమ ఏర్పాటుకై ఉద్యమ కార్యాచరణ రూపొందించి మహాసభల్లో తీర్మానించినట్లు పేర్కొన్నారు.

కార్యవర్గం ఎన్నిక

ఇంద్రవెల్లి: ఆదివాసీ సంక్షేమ పరిషత్ కార్యవర్గాన్ని సోమవారం మండల కేంద్రంలోని కాగ్నే ఫంక్షన్‌హాల్‌లో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నైతం బాలు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఎన్నికల్లో గౌరవ అధ్యక్షుడిగా ఆత్రం ధర్ము, మండల అధ్యక్షుడిగా మర్సుకోల నాందేవ్, ఉపాధ్యక్షుడిగా వెట్టి లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శిగా ఆత్రం మధుకర్, కోశాధికారిగా మర్సుకోల హిరమన్, ధన్వె విజయ్, తోడసం ఇంద్రు, ఆత్రం గిరిజబాయి, సలహా దారుడుగా కొడప భీంరావ్‌లకు ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు కుడే కైలాష్, ముఖడే విష్ణు, సెడ్మాకి రామారావ్, గేడం శ్రీరాం, కుంర శంకర్, నందుకుమార్, అర్క గోవింద్ పాల్గొన్నారు.